క్లుప్తంగా

రోడ్డుపై బైఠాయించిన గ్రామస్తులు



రోడ్డుపై బైఠాయించిన రాళ్లపేట గ్రామస్తులు

తంగళ్లపల్లి: మండలంలోని రాళ్లపేట గ్రామం గాంధీనగర్ ముస్లింలు సోమవారం రోడ్డుపై బైఠాయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు ఖబ్రస్తాన్‌ను కబ్జా చేసి తమపైనే అక్రమంగా ఫిర్యాదులు చేశారని ఆరోపించారు. వారిపై చర్యలు తీసుకోని న్యాయం చేయాలని కోరారు.

కార్గిల్ వరదల నుంచి కాపాడండి



వినతిపత్రాన్ని ఇస్తున్న కాలనీవాసులు

సిరిసిల్లటౌన్: ప్రతి ఏడాది పోటెత్తుతున్న కార్గిల్ లేక్ వరదల నుంచి తప్పించాలని సిరిసిల్లలోని సాయినగర్, ఆదర్శనగర్ వాసులు మున్సిపల్ కమిషనర్ అయాజ్‌కు వినతిపత్రాని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్గిల్ లేక్‌లో వర్షాల దాటికి ఉధృతంగా నీరు వచ్చి తమ ప్రాంతాల్లోని ఇళ్లలోకి నీరు వస్తోందన్నారు. తమ ప్రాంతంలో డ్రెయినేజీలు, సీసీ రోడ్లు నిర్మించాలని కోరారు. రాత్రివేళల్లో నడుస్తున్న ఇసుక ట్రాక్టర్ల మూలంగా నిద్రలేకుండా గడుపుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఈమేరకు కమిషనర్‌కు వినతిపత్రాన్ని అందివ్వగా సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సాంబారి రాజు, శ్రీనివాస్, అల్లి మహేశ్‌కుమార్, తడిగొప్పుల సిద్దు పాల్గొన్నారు.

కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం



సిరిసిల్లటౌన్: బీఆర్‌టీయూ ఆధ్వర్యంలో సిరిసిల్ల అంబేద్కర్ చౌరస్తాలో సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ చిత్రపటాలకు సోమవారం క్షీరాభిషేకం నిర్వహించారు. బీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు వెంగళ శ్రీనివాస్ మాట్లాడుతూ మినీ అంగన్‌వాడీ కేంద్రాలను అప్‌గ్రేడ్ చేసి ఆయాలను కేటాయించడాన్ని హర్షించారు. మినీ అంగన్‌వాడీలు తమ విధులు నిర్వర్తిస్తూ ఆందోళనలు చేపట్టకుండా సమస్యలను తమ పార్టీ ప్రతినిధులకు విన్నవించగా సీఎం దృష్టికి తీసుకెళ్లగా ఆయన పెద్ద మనస్సుతో పరిష్కరించారన్నారు. అంగన్‌వాడీ టీచర్స్ రాష్ట్ర అసోసియేషన్ అధ్యక్షురాలు సంధ్య, రాజేశ్వరి, రాధిక పాల్గొన్నారు.

భక్తి భావం.. సేవా మార్గం



వేములవాడఅర్బన్: గొల్లపల్లెలోని వినాయకుని వద్ద కుంకుమ పూజలు చేస్తున్న మహిళలు

జిల్లాలో భక్తి చైతన్యం వెల్లివిరిసింది. మానవ సేవయే మాధవ సేవగా తలుస్తూ పలు వినాయక మంటపాల్లో ప్రత్యేక పూజా కార్యక్రమాలతో పాటుగా సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించారు. పలు మండపాల్లో కుంకుమపూజలు నిర్వహించగా, రాంభగీచా మంటపం ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరంలో సుమారు 400 మందికి పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. మరోవైపు మంటపాల్లో మహాన్నదానం కార్యక్రమాలు పెద్ద ఎత్తున నిర్వహించారు. డీసీసీ అధ్యక్షుడు ఆది శ్రీనివాస్, బీఆర్‌ఎస్ వేములవాడ నియోజకవర్గ అభ్యర్థి చెల్మెడ లక్ష్మీనర్సింహారావు, టీపీటీడీసీ చైర్మన్ గూడూరి ప్రవీణ్, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి, ప్రజాప్రతినిధులు విఘ్నేశ్వరుని దర్శించుకోని ప్రత్యేక పూజలు చేశారు.

– సిరిసిల్లటౌన్/వేములవాడఅర్బన్/వేములవాడరూరల్/వీర్నపల్లి/గంభీరావుపేట/ముస్తాబాద్/రుద్రంగి కోనరావుపేట/చందుర్తి/ఎల్లారెడ్డిపేట/తంగళ్లపల్లి



సిరిసిల్లటౌన్: రాంభగీచ గణేశ్ మంటప్‌లో ఉచిత వైద్యశిబిరం



ముస్తాబాద్: గూడెంలో కుంకుమ పూజలు



సిరిసిల్లటౌన్: విద్యానగర్‌లో..



ఎల్లారెడ్డిపేటలో..



తంగళ్లపల్లిలో..

నూతన పంచాయతీ భవనం ప్రారంభం

వేములవాడరూరల్: మండలంలోని లింగంపల్లి గ్రామంలో నూతన గ్రామ పంచాయతీ భవనాన్ని ఎంపీపీ, జెడ్పీటీసీ చేతుల మీదుగా ప్రారంభించారు. సర్పంచ్ సామ కవిత ఆధ్వర్యంలో రూ.20 లక్షలతో నూతనంగా నిర్మించిన ఈ భవనాన్ని ఎంపీపీ బండ మల్లేశం, జెడ్పీటీసీ ఏశ వాణి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వేములవాడ రూరల్ మండలంలోని సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు ఏశ తిరుపతి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ వెలుమ బాల్‌రెడ్డి, ఉమ్మడి జిల్లా మాజీ జెడ్పీ చైర్‌పర్సన్ తుల ఉమ, నాయకులు సామ తిరుపతిరెడ్డి, ఉపసర్పంచ్ పుల్లూరి ప్రేమల, కార్యదర్శి ప్రేమ్‌చంద్, ఏఈవో సందీప్, ఎంపీటీసీ తిరుపతి, అన్ని గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులను శాలువాతో సత్కరించారు.



ప్రారంభోత్సవంలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు

ప్రొటోకాల్ పాటించలేదని..

లింగంపల్లి గ్రామంలో నూతన గ్రామ పంచాయతీ భవనాన్ని ప్రారంభించగా రూరల్ సెస్ డైరెక్టర్ ఆకుల దేవరాజం పేరును పెట్టకపోవడంతో ఆయన వర్గానికి చెందిన కొంతమంది ప్రజాప్రతినిధులు ప్రారంభానికి దూరంగా ఉన్నారు. ప్రొటోకాల్ ప్రకారం శిలాఫలకంపై ఆయన పేరును పెట్టాలని ఆదేశాలున్నప్పటికీ అవేమీ పట్టించుకోకుండా సర్పంచ్ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. లింగంపల్లి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్, ప్రస్తుత సెస్ డైరెక్టర్‌గా ఉన్న ఆయనను కావాలనే పేరు పెట్టలేదని ఆరోపించారు.

ఐలమ్మ జయంతి ఉత్సవాలకు మంత్రి కేటీఆర్‌కు ఆహ్వానం

సిరిసిల్ల: తెలంగాణ ఉద్యమ బావుట చాకలి(చిట్యాల) ఐలమ్మ జయంతి ఉత్సవాలకు రావాల్సిందిగా రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, మున్సిపల్ శాఖ మంత్రి కె.తారక రామారావును సోమవారం మాజీ మంత్రి, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య ఆహ్వానించారు. ఈ మేరకు రాష్ట్ర సచివాలయంలో మంత్రి కేటీఆర్‌ను కలిసి చాకలి ఐలమ్మ చిత్రపటాన్ని, ఆహ్వాన పత్రికను అందించారు. రవీంద్రభారతిలో రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తున్న ఐలమ్మ 128వ జయంతి వేడుకలకు మంత్రి కేటీఆర్‌ను రావాల్సిందిగా కోరారు. జయంతి ఉత్సవ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు అక్కరాజు శ్రీనివాస్, వైస్‌చైర్మన్‌లు కోనె సంపత్, కుమారస్వామి, జయరాం ఉన్నారు.



కేటీఆర్‌కు ఐలమ్మ చిత్రపటాన్ని అందిస్తున్న ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య.

మంత్రి కేటీఆర్‌ను కలిసిన పర్శ హన్మాండ్లు

గంభీరావుపేట: బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి, రాష్ట్ర ముదిరాజ్ సభ ఉపాధ్యక్షుడు పర్శ హన్మండ్లు సోమవారం హైదరాబాద్‌లో మంత్రి కేటీఆర్‌ను కలిశారు. మండల కేంద్రంలో బీసీ హాస్టల్, జిల్లా కేంద్రంలో జ్యోతిబా పూలె విగ్రహం ఏర్పాటు చేయాలని, మండలంలోని శ్రీగాధ, రాజుపేట, కోళ్లమద్ది, రాజుపేట గ్రామాల్లో నెలకొన్న సమస్యలను కేటీఆర్‌కు వివరించగా మంత్రి సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు.

తెలంగాణ భాషకు పట్టంకట్టిన కవి సీతారాం

ఎల్లారెడ్డిపేట: తెలంగాణ ప్రజల జీవితాన్ని, భాషను తన రచనల్లో చిత్రీకరించిన గొప్పకవి, కథారచయిత గూడూరి సీతారాం అని, రచయితగా సమాజానికి ఆయన చేసిన సేవలు మరువలేవమని తెలంగాణ రచయితల సంఘం జిల్లా అధ్యక్షుడు వాసరవేణి పర్శరాములు అన్నారు. మండల శాఖ అధ్వర్యంలో సోమవారం సీతారాం 12వ వర్ధంతిని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణలో దొరల అరాచకాలను, రజాకార్ల ఆగడాలను తన రచనల్లో చిత్రీకరించారన్నారు. భాష, సాంస్కృతికి పట్టం కట్టారన్నారు.



సీతారాంకు నివాళి అర్పిస్తున్న సభ్యులు

కార్యక్రమంలో మండల అధ్యక్షుడు దుంపెన రమేశ్, సభ్యులు శ్రీనివాస్, దస్తగిరి, రాహుల్, శ్రీకుమార్, శివకుమార్, కిషన్ పాల్గొన్నారు.

సామాజిక సేవా దృక్పథం అలవర్చుకోవాలి

గంభీరావుపేట: విద్యార్థి దశ నుంచే సామాజిక సేవా దృక్పథాన్ని అలవర్చుకోవాలని గంభీరావుపేట పీజీ అండ్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ వి.విజయలక్ష్మీ అన్నారు. కళాశాలలో సోమవారం ఎన్‌ఎస్‌ఎస్ డే వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో విద్యార్థులకు మార్గనిర్దేశనం చేశారు. ఆదర్శవంతమైన నవ సమాజ నిర్మాణం కోసం విద్యార్థులు పాటుపడాలన్నారు. ఎన్‌ఎస్‌ఎస్ ఏర్పాటు, లక్ష్యాల గురించి విద్యార్థులకు వివరించారు. అనంతరం ఎన్‌ఎస్‌ఎస్, డిపార్ట్‌మెంట్ ఆఫ్ జువాలజీ, ప్రభుత్వాసుపత్రి అధికారులు సంయుక్తంగా కళాశాల విద్యార్థులకు బ్లడ్ గ్రూపింగ్ నిర్వహించారు. కార్యక్రమంలో వైస్‌ప్రిన్సిపాల్ పిట్ల దాసు, ఎన్‌ఎస్‌ఎస్ పీవో పాక ధర్మపురి, సీనియర్ అధ్యాపకులు కృష్ణమూర్తి, ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ ఫయాజ్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ విజయలక్ష్మీ

నియామకం

కాంగ్రెస్ బీసీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడిగా శ్రీనివాస్

బోయినపల్లి: కాంగ్రెస్ బీసీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడిగా మండలంలోని తడగొండ గ్రామానికి చెందిన ముదాం శ్రీనివాస్‌ను, మండల కార్యదర్శుగా అల్వాల ధర్మయ్య, మండల నరేశ్, కార్యవర్గసభ్యుడిగా తోట మహేశ్‌ను నియోజకవర్గ ఇన్‌చార్జి మేడిపల్లి సత్యం నియమించినట్లు కాంగ్రెస్ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు కూస రవీందర్, మండల అధ్యక్షుడు వన్నెల రమణారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ ఉయ్యాల శ్రీనివాస్, జిల్లా నాయకులు ఏనుగుల కనుకయ్య, మండల నాయకులు పాల్గొన్నారు.

భారతీయ విద్యార్థి సేన కార్యవర్గం

కోనరావుపేట: భారతీయ విద్యార్థి సేన మండల కమిటీ అధ్యక్షుడిగా పని సృజన్, ఉపాధ్యక్షుడిగా సుల్తాన్ పర్శరాం, ప్రధానకార్యదర్శిగా కూర నవీన్ ఎన్నికయ్యారు. కోనరావుపేట గ్రామ అధ్యక్షుడిగా చల్ల మురళి ఎన్నికయినట్లు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆముద మధు తెలిపారు. కార్యక్రమంలో గోపి, సాయి, మంగినపల్లి రాఘవ, సాగర్, అరవింద్, ప్రేమ్‌చంద్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు రాహుల్



వీర్నపల్లి: మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల పదోతరగతి విద్యార్థి బానోత్ రాహుల్ అథ్లెటిక్స్‌లో రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు పీఈటీ అక్బర్ షరీఫ్ తెలిపారు. ఈ నెల 9న జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సిరిసిల్లలో నిర్వహించిన 9వ తెలంగాణ జూనియర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీల్లో రాణించాడు.

పంచాయతీ కార్మికుల సమ్మె నోటీసు



ఎంపీడీవోతో మాట్లాడుతున్న కార్మికులు

తంగళ్లపల్లి: తమ న్యాయమైన డిమాండ్లను వెంటనే నెరవేర్చాలని లేనిపక్షంలో మరోమారు సమ్మెకు వెళ్తామని ఎంపీడీవో పి.లచ్చాలుకు పంచాయతీ కార్మికులు సోమవారం సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం హామీ ఇవ్వడంతో తమ సమ్మెను విరమించి విధుల్లో చేరామని కానీ ఇప్పటివరకు హామీలు అమలు కాలేదని ఆరోపించారు. త్వరలో న్యాయమైన డిమాండ్లను నెరవేర్చని పక్షంలో అక్టోబర్ 2 నుంచి సమ్మెలోకి వెళ్తామన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్మికుల మండల అధ్యక్షుడు బుర్ర శ్రీనివాస్‌గౌడ్, గౌరవ అధ్యక్షుడు కోల చంద్రం, ప్రధాన కార్యదర్శి లింగంపల్లి కృష్ణవేణి, ఉపాధ్యక్షుడు కాసాని రవి, ఆత్మకూరి తిరుపతి, పెంట రాజు పాల్గొన్నారు.

కోతుల బెడద నివారించండి

కోనరావుపేట: మండలం సుద్దాలలో కోతుల బెడద నివారించాలని కోరుతూ ఉపసర్పంచ్ ఎరవెల్లి నాగరాజు, గ్రామస్తులు కలెక్టర్‌కు సోమవారం ఫిర్యాదు చేశారు. గ్రామంలో కొన్ని రోజులుగా కోతుల బెడద ఎక్కువైందన్నారు. ఇళ్లలోకి చొరబడి ఇంట్లోని తినుబండారాలను, సామగ్రిని ఎత్తుకెళ్లుతున్నాయని అన్నారు. గ్రామంలో ఇదివరకు ఇద్దరిపై దాడికి పాల్పడ్డాయని తెలిపారు.

వయోవృద్ధులకు ఉపకరణాలు పంపిణీ



ఉపకరణాలు పంపిణీ చేస్తున్న ఎంపీపీ

బోయినపల్లి: మండలంలోని వయోవృద్ధులకు ప్రభుత్వం నుంచి మంజూరైన ఉపకరణాలను స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ పర్లపల్లి వేణుగోపాల్ సోమవారం పంపిణీ చేశారు. మండలంలో 67 మంది లబ్ధిదారులకు రూ.2.48 లక్షల విలువ గల ఉపకరణాలు అందించారు. వీటిలో వీల్‌చైర్స్, నడుం, మెడ పట్టీలు, వినికిడి యంత్రాలు, చంక, చేతికర్రలు తదితర 15 రకాల ఉపకరణాలు ఉన్నాయి. కార్యక్రమంలో వేములవాడ ఐసీడీఎస్ సీడీపీవో ఎల్లయ్య, సర్పంచ్ లతశ్రీ గుంటి, ఎంపీటీసీ బుచ్చమ్మ, వైస్ ఎంపీపీ నాగయ్య, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు కత్తెరపాక కొండయ్య పాల్గొన్నారు.

ఈత వనాలతో గీత కార్మికులకు ఉపాధి

బోయినపల్లి: ఈత వనాల పెంపకంతో గ్రామాల్లో గీత కార్మికులకు ఉపాధి దొరుకుతుందని సిరిసిల్ల ఎక్సైజ్ సీఐ గులామ్ ముస్తాఫా, ఎస్సై విజయేందర్ అన్నారు. మండలంలోని వరదవెల్లి గ్రామంలో హరితహారంలో భాగంగా గౌడ సంఘం నాయకులతో కలిసి సోమవారం 1500 ఈత మొక్కలు నాటారు. కార్యక్రమంలో గౌడ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు నాగుల శ్రీనివాస్, బుర్ర తిరుపతి, బొలుగం పర్శరాములు, నాగుల సాంబయ్య, కైర నాగరాజు, నాగుల వసంత, నాగుల ఆగయ్య, అబ్బయ్య, నాగుల పర్శరామ్, బుర్ర కాశయ్య, వైకుంఠం, ఎక్సైజ్ సిబ్బంది ఎస్. నరేందర్, ఎం. సుజాత పాల్గొన్నారు.



ఈత మొక్కలు నాటుతున్న ఎక్సైజ్ అధికారులు

విద్యార్థుల మెగా రక్తదాన శిబిరం

సిరిసిల్లటౌన్: ఎన్‌ఎస్‌ఎస్ దినోత్సవం సందర్భంగా జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో సోమవారం మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. సిరిసిల్లలోని వికాస్ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన కార్యక్రమాన్ని టౌన్ సీఐ ఉపేందర్ ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులు సామాజిక సేవాతత్వం గొప్పదని కొనియాడారు. జిల్లా ఆసుపత్రి బ్లడ్‌బ్యాంకు సిబ్బంది 40 యూనిట్ల రక్తాన్ని సేకరించారు. కళాశాల కరస్పాండెంట్ దిడ్డి శ్రీనివాస్, రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా అధ్యక్షుడు గుడ్ల రవి, ముసిపట్ల లక్ష్మీనారాయణ, ఎల్లె లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.



విద్యార్థులను ప్రశంసిస్తున్న టౌన్ సీఐ ఉపేందర్

రెవెన్యూ డివిజన్ కోసం ప్రజాభిప్రాయ సేకరణ

వీర్నపల్లి: మండల కేంద్రంలో అఖిలపక్షం ఆధ్వర్యంలో ఎల్లారెడ్డిపేట రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేయాలని సోమవారం ప్రజాభిప్రాయ సంతకాల సేకరణ చేశారు. ఈ సందర్భంగా ఎల్లారెడ్డిపేట కేంద్రంగా గంభీరావుపేట, ముస్తాబాద్, వీర్నపల్లి మండలాలను కలుపుతూ రెవెన్యూ డివిజన్ చేయాలన్నారు. అందుకుగానూ ప్రజల నుంచి ప్రజాభిప్రాయ సంతకాల సేకరణ చేసినట్లు తెలిపారు. ప్రజలకు దూరభారంతో పాటు, సమయం కూడా వృథా కాకుండా మిగులుతుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు పీర్యా, మల్లేశం పాల్గొన్నారు.



సంతకాలు సేకరిస్తున్న నాయకులు

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన

గంభీరావుపేట: మండలంలోని లింగన్నపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం తెలంగాణ గ్రామీణ బ్యాంక్ ఆధ్వర్యంలో ఆర్థిక, సాంకేతిక అక్షరాస్యతపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. నాటక రూపంలో సులభంగా అర్థమయ్యే రీతిలో వివరించారు. బ్యాంకులు అందిస్తున్న సేవలను, రుణాలను వివరించారు. కార్యక్రమంలో బ్యాంక్ మేనేజర్ సత్యం, ప్రధానోపాధ్యాయులు గంగారాం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

హిందువుల మనోభావాలు దెబ్బతీస్తున్న ప్రభుత్వం

సిరిసిల్లఅర్బన్: హిందువుల మనోభావాలను దెబ్బతీసేలా ప్రభుత్వం వ్యవహరిస్తోందని బీజేపీ జిల్లా కార్యదర్శి రెడ్డబోయిన గోపి పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. హిందువుల ఉత్సవాలు జరగుతున్న తరుణంలో పోలీసులు ఆంక్షల పేరిట వినాయక మండపాల నిర్వాహకులను ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. డీజే నిర్వాహకులను తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేయడంపై ప్రశ్నించారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, హనుమాండ్లగౌడ్, తంగళ్లపల్లి మండలాధ్యక్షుడు సురువు వెంకటరెడ్డి, తిరుపతిరెడ్డి, కార్తీక్‌రెడ్డి, బాలయ్య ఉన్నారు.

'వెంచర్లపై కాకుండా పేదలపై శ్రద్ధ పెట్టండి'

సిరిసిల్లటౌన్: ప్రభుత్వ వెంచర్లపైనా కాకుండా డబుల్‌బెడ్‌రూమ్ రాని నిరుపేదలపై జిల్లా అధికారులు దృష్టి పెట్టాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మూశం రమేశ్ కోరారు. జిల్లా కేంద్రంలోని బీవై నగర్ పార్టీ ఆఫీస్‌లో సోమవారం నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో మాట్లాడారు. డబుల్‌బెడ్రూం కోసం వందలాది సంఖ్యలో నిరుపేదల కుటుంబాలు పాలకులు, అధికారుల చుట్టూ తిరుగుతుంటే వారికి ఇవ్వలేదన్నారు. కనీసం నివేశన స్థలాలు ఇచ్చి అందులో ఇల్లు కట్టుకునేందుకు రూ.5లక్షలు చొప్పున ఇవ్వాలని డిమాండ్ చేశారు. పెద్దూరు శివారులో ప్రభుత్వ వెంచర్‌పై కలెక్టర్, మున్సిపల్ యంత్రాంగం కృతనిశ్చయంతో పనిచేస్తున్నారని ఇదే శ్రద్ధతో డబుల్‌బెడ్రూం రాని నిరుపేదలకు ఇండ్లు అందించేలా చూడాలని కోరారు. నాయకులు కోడం రమణ, బెజ్జగం సురేష్, పోచమ్మ, కోసారి సత్యనారాయణ పాల్గొన్నారు.

ముదిరాజ్‌లు ఐక్యతతో ముందుకుసాగాలి

చందుర్తి: ముదిరాజ్‌లు ఐక్యతతో ముందుకుసాగాలని ఉమ్మడి కరీంనగర్ జిల్లా జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ తుల ఉమ అన్నారు. మత్స్య పరిశ్రమశాఖ జిల్లా డైరెక్టర్‌గా ఎన్నికైన చందుర్తి ముదిరాజ్ సంఘం సభ్యుడు పిట్టల బాబును సోమవారం సన్మానించారు. మాజీ ఎంపీపీ చిలుక పెంటయ్య, ఓబీసీ జిల్లా ఉపాధ్యక్షుడు హనుమయ్యాచారి, ముదిరాజ్ మండల అధ్యక్షుడు తుపాకుల రవి, ఆయా గ్రామాల సంఘం అధ్యక్షులు పాల్గొన్నారు.

ఈ పంచాయతీ ఆపరేటర్ల సమ్మె నోటీసు

సిరిసిల్ల/వేములవాడరూరల్/బోయినపల్లి: పేస్కేల్ అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ పంచాయతీ ఆపరేటర్లు ఇల్లంతకుంటలో ఎంపీపీ వెంకటరమణారెడ్డికి, బోయినపల్లిలో ఎంపీడీవో నల్లా రాజేందర్‌రెడ్డి, వేములవాడరూరల్‌లో ఎంపీపీ బండ మల్లేశం సోమవారం సమ్మె నోటీసు అందించారు. అలాగే ప్రభుత్వం తమ సమస్యలు పరిష్కరించేలా చొరవ తీసుకోవాలని కోరుతూ ఎంపీపీ పర్లపల్లి వేణుగోపాల్, ఎంపీడీవో నల్లా రాజేందర్ రెడ్డి, ఎంపీవో గంగాతిలక్‌కు వినతిపత్రాలు సమర్పించారు. కార్యక్రమంలో ఈ పంచాయతీ ఆపరేటర్లు గౌతం, రాగుల నరేందర్, మల్లగల్ల ఆనంద్, నర్సింగోజు శ్రీధర్, మంద రాధిక పాల్గొన్నారు.



బోయినపల్లి ఎంపీపీకి వినతిపత్రం అందిస్తున్న ఈ పంచాయతీ ఆపరేటర్లు

సంక్షిప్త వార్తలు

దీన్‌దయాల్‌కు నివాళి



బోయినపల్లిలో నివాళి అర్పిస్తున్న నాయకులు

కోనరావుపేట/బోయినపల్లి: జన్‌సంఘ్ వ్యవస్థాపకుడు పండిట్ దీన్‌దయాల్ ఉపాధ్యాయ జయంతి వేడుకలను ఘనంగా బీజేపీ నాయకులు నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షులు గొట్టె రామచంద్రం గుడి రవీందర్‌రెడ్డి, నియోజకవర్గ జాయింట్ కన్వీనర్ ఉదారి నర్సింహాచారి పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు సమాచార హక్కు దరఖాస్తు

తంగళ్లపల్లి: మండలం రాళ్లపేట గ్రామం గాంధీనగర్ పరిధిలోని ఖబ్రస్తాన్‌ను కొందరు వ్యక్తులు కబ్జా చేశారని ఆ భూమికి సంబంధించిన వివరాలు సమాచార హక్కు చట్టం ప్రకారం తెలపాలని తహసీల్దార్ వెంకటలక్ష్మికి ముస్లిం నాయకులు దరఖాస్తు అందజేశారు. ఈ భూమి తమదని కొందరు వ్యక్తులు పేర్కొంటున్నారని అన్నారు. కార్యక్రమంలో మహ్మద్ హమీద్, మెహరాజ్, గోరేమియా హైదర్ పాల్గొన్నారు.

మహిళా మండలి భవనాన్ని కాపాడాలి

ముస్తాబాద్: 30 ఏళ్ల క్రితం ప్రభుత్వం నిర్మించిన మహిళా భవనాన్ని కాపాడాలని కోరుతూ ముస్తాబాద్ మండలం చీకోడులో నాయకులు సోమవారం ధర్నా చేపట్టారు. మాజీ ఎంపీటీసీ అంజనేయులు మాట్లాడుతూ మహిళ సంఘాల కోసం నిర్మించిన భవనాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత గ్రామస్తులపై ఉందన్నారు. ప్రభుత్వ ఆస్తులను విక్రయించే వారిపై చర్యలు తీసుకోవాల్సిన అధికారులు మౌనం వహిస్తున్నారని అన్నారు. కలెక్టర్ దీనిపై విచారణ చేపట్టి భవనాన్ని కాపాడాలని కోరారు. కార్యక్రమంలో గున్నాల రమేశ్, గాంతుల మహేశ్, బాధ నరేశ్, గున్నాల రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

అవయవదానం గొప్ప మనసున్న వారికే సాధ్యం

సిరిసిల్లటౌన్: అవయవ దానం చేయడం గొప్ప మనసున్న వారికే సాధ్యమని సదాశయ ఫౌండేషన్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ భీష్మాచారి అన్నారు. సిరిసిల్లకు చెందిన కిషన్ మధు నేత్రదానం చేయగా సోమవారం ఆయన సంస్మరణ సభ జరిగింది. ఈ సందర్భంగా కిషన్ కుటుంబ సభ్యులకు కౌన్సిలర్ వేముల రవి చేతుల మీదుగా నేత్రదానం సర్టిఫికెట్‌ను అందించారు. కార్యక్రమంలో మృతుడు కుటుంబ సభ్యులు, వార్డు పెద్దలు, ఫౌండేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

పశువులకు గర్భధారణ పరీక్షలు

తంగళ్లపల్లి: మండలంలోని దేశాయిపల్లె గ్రామంలో సోమవారం ప్రభుత్వ పశువైద్యాధికారి డాక్టర్ సంతోష్ ఆధ్వర్యంలో 50 పశువులకు గర్భధారణ పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ నకీర్తి బాలమల్లు, పశుపోషకులు గోపాలమిత్ర సూపర్‌వైజర్ రాములు పాల్గొన్నారు.